తెలంగాణ విషయంలో రాజీపడం



- లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకుంటే బీఆర్‌ఎస్ పాత్ర లేనట్టుకాదు..
- ప్రజానుకూల ప్రభుత్వం ఉండాలి
- నిర్మాణాత్మక ప్రతిపక్షం కావాలి
- ఎన్నికల్లో దేశ ప్రజల నిర్ణయం అదే
- కేసీఆర్ మరచిపోలేని గౌరవాన్నిచ్చారు
- బీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేత సురేశ్‌రెడ్డి
- 'నమస్తే తెలంగాణ'కు ఇంటర్వ్యూ..

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేదని, లోక్‌సభలో బీఆర్‌ఎస్ భాగస్వామ్యం లేనంత మాత్రాన పార్లమెంటరీ ప్రజస్వామ్య వ్యవస్థలో తమ పార్టీ పాత్రిని ధ్యమే లేదన్నట్టు వ్యాఖ్యానించటం సరికాదని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేతగా నియమితులైన కేఆర్ సురేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌కు కేవలం ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం సాధించామనే విషయాన్ని, ఆ సమయంలో నేరుగా బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన రాజ్యసభ సభ్యులు ఎంతమంది ఉన్నారనే విషయాన్ని ఎవరూ విస్మరించొద్దన్న ఆయన, 'నమస్తే తెలంగాణ'కు మంగళవారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ అవకాశం రావటంపై మీ స్పందన?

పార్లమెంటరీ పార్టీకి నాయకుడిగా నియామకం కావడం నా జీవితంలో గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. కేసీఆర్ ఇచ్చిన ఈ అవకాశాన్ని నిలబెట్టుకుంటా. నా జీవితంలో మర్చిపోలేని గౌరవాన్నిచ్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు.

పార్లమెంట్‌లో మీ పాత్ర ఎలా ఉండబోతున్నది?

తెలంగాణ రాజకీయాల్లోనే కాదు, జాతీయ రాజకీయాల్లోనూ బీఆర్‌ఎస్ ఒక సంచలనమనే విషయాన్ని ఎవరూ విస్మరించొద్దు. తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన పార్టీ చరిత్రను చూడాలి. సాంకేతికంగా మాకు లోక్‌సభలో సభ్యులు లేనంత మాత్రాన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీల పాత్రను తక్కువ చేసి చూడొద్దు. తెలంగాణ ప్రయోజనాల అంశంలో బీఆర్‌ఎస్ రాజీలేని పోరాటం చేస్తుంది. అందులో ఎలాంటి మార్పు ఉండదు. తెలంగాణ హక్కుల సాధన విషయంలో అవసరమైతే దూకుడు పెంచుతామే కానీ తగ్గే ప్రసక్తేలేదు. రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, 24 గంటల ఉచిత కరెంట్, కల్యాణలక్ష్మి, జిల్లాకో మెడికల్ కాలేజీ ఇలా అనేక విషయాల్లో దేశం, అనేక రాష్ట్రాలు తెలంగాణను, కేసీఆర్‌ను అనుసరించాయి. సాగునీరు, విద్యుత్, ఐటీ వంటి రంగాల్లో కేసీఆర్ విధానాలు ఎప్పటికీ రిలవెన్సే. పార్లమెంట్ సమావేశాలున్నప్పుడు, లేనప్పుడు పార్లమెంటరీ కమిటీల్లో చురుగ్గా పాల్గొంటాం. కమిటీల్లో పాలసీ, పరిశోధన, చట్టాల రూపకల్పనలో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తాం. పార్లమెంట్ చర్చలు, ప్రశ్నోత్తరాలను సంపూర్ణంగా వినియోగించుకుంటాం. పార్టీ అధినేత దిశానిర్దేశానికి అనుగుణంగా కార్యాచరణ ఉంటుంది. సమావేశాల్లో మా సభ్యులందరం క్రియాశీలకంగా పాల్గొనేందుకు, సభ్యులకు కావాల్సిన సమాచారం అందజేస్తా. పార్లమెంట్ కమిటీల్లో బీఆర్‌ఎస్ మార్క్ చూపిస్తాం.

పార్లమెంట్‌లో ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వ సమావేశాల తీరు ఎలా ఉంటుందంటారు?

కచ్చితంగా గత పార్లమెంట్ కంటే ఈసారి భిన్నంగానే ఉంటుంది. ప్రజాభీష్టం మేరకు రూలింగ్ పార్టీ నడుచుకోవాలి. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వారి సూచనలు స్వీకరించాలి. అలా కాకుండా అధికారం చేతిలో ఉంది కదా అని వ్యవహరిస్తే అన్ని పార్టీలతో కలిసి కార్యాచరణ రూపొందిస్తాం. కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటే ఏమిటో ఈసారి స్పష్టంగా కండ్ల ముందున్నది. ప్రజానుకూల ప్రభుత్వం ఉండాలి. నిర్మాణాత్మక ప్రతిపక్షం ఉండాలన్నదే దేశ ప్రజల తీర్పు. గతంలో ప్రభుత్వం సభ్యుల వ్యాఖ్యలను బుల్డోజ్ చేసినట్టుగా ఇప్పుడు కుదరదని ఈ సారి ప్రభుత్వానికి ముందే తెలిసింది. కనుక జాగ్రత్తగా ఉంటుందని, అన్ని పక్షాలకు సమాన గౌరవాన్నిస్తుందని ఆశిస్తున్నాం. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ తరపున మేము నిర్మాణాత్మక పాత్రను పోషిస్తాం.

నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని మీరెలా చెప్తున్నారు?

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలే ప్రజల పక్షాన చట్టసభల్లో, బయటా ప్రాతినిధ్యం వహిస్తాయి. అధికారం లేనంత మాత్రాన, సభలో ప్రాతినిధ్యం లేనంత మాత్రాన రాజకీయ పార్టీ ఉండనే ఉండదనుకోవటం అవగాహనా రాహిత్యమే. దశాబ్దాలుగా ఎదురుచూసిన తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన పార్టీ, దాదాపు పదేండ్లపాటు దేశమే ఆశ్చర్యపోయేలా రాష్ట్రాన్ని ముందుకు నడిపిన పార్టీకి మనుగడ ఉండదనుకోవడం పొరపాటే అవుతుంది. తెలంగాణ ప్రయోజనాలు, హక్కుల సాధనలో బీఆర్‌ఎస్ ప్రాముఖ్యత ఇప్పుడే ఎక్కువ అవసరం. ఇలాంటి క్లిష్ట సమయంలో బీఆర్‌ఎస్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం ఉంటే మరోలా ఉండేది. బీజేపీ నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి 8 మంది ఎంపీలున్నారు సరే.. వారు ప్రాతినిధ్యం వహించే పార్టీల నిర్ణయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారే తప్ప తెలంగాణ ప్రజల కోణంలో వాటి కార్యాచరణ ఉండదని గతానుభవాలు చెప్తున్నాయి. రాష్ట్ర విభజన చట్టంలో కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు, నీటి కేటాయింపులు ఇలా అనేక అంశాల్లో బీఆర్‌ఎస్ తన పాత్రను తప్పకుండా పోషిస్తుంది. ఈ విషయంలో కేసీఆర్ ఎప్పటికప్పుడు మాకు దిశానిర్దేశం చేస్తూనే ఉంటారు.

బాలిక అక్రమ రవాణా నిందితుల పిటిషన్లు డిస్మిస్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): యాదగిరిగుట్టలో బాలికలను అక్రమంగా తరలించడమే కాకుండా వారికి బలవంతంగా హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి వ్యభిచార కూపంలోకి నెట్టినట్టు 2018లో తమపై పెట్టిన కేసులను కొట్టివేయాలని నిందితులు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. జస్టిస్ కే సుజన మంగళవారం ఈ కేసు విచారణ చేపట్టారు. నిందితులు కామసాని రాజేశ్వరి, అనిత, వంశీ, జమున, జ్యోతిపై నమోదైన అభియోగాలు నిరాధారమైనవని వారి తరపు న్యాయవాది వాదించారు. ఈ కేసును ప్రత్యేక అధికారి దర్యాప్తు చేయాలన్న నిబంధనకు విరుద్ధంగా పోలీసులే దర్యాప్తు చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. అంతేకాకుండా తమపై లైంగిక దాడి జరిగినట్టు పిల్లలు మేజిస్ట్రేట్ ఎదుట ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పలేదని పేర్కొంటూ.. ఈ కేసును కొట్టివేయాలని కోరారు. దీనిపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ గణేశ్ స్పందిస్తూ.. నిందితులు అక్రమంగా బాలికలను తరలిస్తున్నారని, వారి శరీర సౌష్టవాన్ని పెంచేందుకు బలవంతంగా హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి వ్యభిచార కూపంలోకి నెడుతున్నారని తెలిపారు. దీంతో నిందితుల పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్టు హైకోర్టు ప్రకటించింది.

పాత కక్షలతో మహిళ దారుణ హత్య

కామారెడ్డి రూరల్, జూన్ 18: ఇంట్లో గొడవలతో తండ్రిని చితకబాదుతున్న ఓ వ్యక్తి.. ఎదురుగా కనిపించిన ఓ మహిళపై దాడికి పాల్పడ్డాడు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని ఆమెను దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన సోమవారం రాత్రి కామారెడ్డి జిల్లా తిమ్మక్పల్లి గ్రామంలో జరిగింది. తిమ్మక్పల్లిలో రాగుల లక్ష్మి (80), రాగుల రాజశేఖర్ కుటుంబాలు పక్కపక్కనే నివాసముంటున్నాయి. రెండు కుటుంబాల మధ్య గతంలో గొడవలు జరిగాయి. సోమవారం సాయంత్రం తన తండ్రితో గొడవపడిన రాజశేఖర్.. తండ్రిని చితకబాదుతూ బయటకు లాక్కొచ్చాడు. అదే సమయంలో రోడ్డు మీదుగా వెళ్తున్న లక్ష్మి కనిపించడంతో తండ్రిని వదిలిపెట్టి ఆమెపై దాడికి దిగాడు. ఇటుక పెల్లలు తీసుకుని తలపై, చెవిపై బలంగా కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెతో ఉన్న మనువడిపైనా దాడి చేశాడు. ఇది గమనించిన స్థానికులు లక్ష్మిని హుటాహుటిన కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో లక్ష్మి మృతి చెందింది. తన తల్లిని చంపిన రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు పెద్ద నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉందని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

భారీగా డంప్ స్వాధీనం

కొత్తగూడెం క్రైం, జూన్ 18 : మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్నది. సుక్మా జిల్లాలో బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ భద్రతా దళాలు మావోయిస్టుల కోసం చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కరకన్‌గుండ అడవుల్లో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని గాలించగా, మావోయిస్టులకు సంబంధించి ఆయుధ, మందుగుండు, వస్తు సామగ్రి భారీ ఎత్తున లభించింది.

బీరుపోయిన మంత్రిగారు!

మొదటిపేజీ తరువాయి...

వెనుక చక్రం తిప్పిన బయటివ్యక్తులు ఎవరనే చర్చ మొదలైంది.

తెలంగాణ ప్రభుత్వం సోమ్ డిస్టలరీకి అనుమతిలిచ్చిందంటూ నమస్తే తెలంగాణ గత నెలలో కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి స్పందించి.. అనుమతులేవీ ఇవ్వలేదని తొలుత చెప్పారు. కానీ, కొద్దిరోజులకే సోమ్ డిస్టలరీతోపాటు కొత్తగా ఐదు మద్యం కంపెనీలకు అనుమతులిచ్చిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. హంటర్, బీర్‌యాని, బ్లాక్‌బస్టర్ వంటి బీర్ల బ్రాండ్ల ఫొటోలు కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అవాక్కయిన మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశం పెట్టి మరీ.. అనుమతుల సంగతి తనకు తెలియదని, పర్మిషన్లు ఇచ్చేది బేవరేజెస్ కార్పొరేషన్ అని సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. తన శాఖలో తనకు తెలియకుండా జరుగుతున్న పరిణామాలతో ఆగ్రహంగా ఉన్న ఆయన మంగళవారం ఎక్సైజ్ అధికారులతో సమావేశమయ్యారు. నాంపల్లిలోని ఆబ్కారీభవన్‌కు ఉదయం 11 గంటలకు వచ్చిన మంత్రి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్, ఎండీ, బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్, ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఇటీవల ఎక్సైజ్ శాఖలో చోటు చేసుకున్న పరిణామాలపై, తనను బైపాస్ చేస్తూ తీసుకున్న పలు నిర్ణయాలపై ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్త మద్యం కంపెనీల రాక వెనుక ఉన్న వ్యక్తులు, శక్తులు ఎవరనే దానిపై సంజాయిషీ ఇవ్వాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఈ అనుమతుల వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి సమగ్ర నివేదికను తనకు సమర్పించాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్, ఎండీ శ్రీధర్, బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహంను ఆదేశించారు. నివేదికను బట్టి తక్షణమే చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. తన విశ్వసనీయతను దెబ్బతీస్తే ఎవరైనా సరే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.

'నాకు తెలియకుండానే హైదరాబాద్‌లో రెండు పబ్బులకు అనుమతి ఎట్లా ఇచ్చారు? ఎవరిచ్చారు? నాకు తెలియకుండానే ఓ మద్యం దుకాణానికి ఎట్లా పర్మిషన్ ఇచ్చారు? ఇదంతా ఎవరు చేస్తున్నారు? ఎవరు చెప్తే చేస్తున్నారు?

ఏ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకున్నారు?

తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు చెడ్డపేరు వస్తున్నదని.. కీలకమైన బాధ్యతల్లో ఉన్నవారు ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టంచేశారు. అధికారుల సొంత నిర్ణయాల వల్ల ఎక్సైజ్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగిందని, దీనివల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రిగా తన విశ్వసనీయత కూడా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. కొత్త మద్యం కంపెనీల అనుమతుల వ్యవహారంలో తన దృష్టికి తీసుకురాకుండా బేవరేజెస్ కార్పొరేషన్ అధికారులు ఎలా విధివిధానాలు ఖరారు చేశారని మండిపడ్డారు. అసలు ఏ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకున్నారో చెప్పాలని అధికారులను ఆయన నిలదీశారు.

పబ్బులకూ అనుమతులపై మంత్రి ఆగ్రహం

మద్యం కంపెనీలకే కాకుండా పబ్బులకు, మద్యం దుకాణానికి అనుమతులు ఇవ్వడంపైనా మంత్రి జూపల్లి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నాకు తెలియకుండానే హైదరాబాద్‌లో రెండు ప్లబ్బులకు అనుమతి ఎట్లా ఇచ్చారు? ఎవరిచ్చారు? నిబంధనలు లేకపోయినా ఓ మద్యం దుకాణానికి ఎట్లా పర్మిషన్ ఇచ్చారు? ఇదంతా ఎవరు చేస్తున్నారు? ఎవరు చెప్తే చేస్తున్నారు? అంటే నేను డమ్మీనా? మంత్రిగా నాకేమీ విలువ లేదా?' అంటూ జూపల్లి ఓ దశలో అధికారులపై మండిపడ్డారని సమాచారం. తనకు తెలియకుండా జరుగుతున్న వాటి వెనుక ఉన్న వారెవరో తెలియాలంటూ.. అధికారుల నుంచి సమాచారం రాబట్టేందుకు ఆయన పలు విధాలుగా ప్రయత్నించినట్టు తెలిసింది. కొత్త మద్యం బ్రాండ్ల అనుమతులనేవి పెద్ద వ్యవహారమని, పెద్దస్థాయి వ్యక్తులే అధికారుల నిర్ణయాలను ప్రభావితం చేసి ఉంటారని తెలుస్తున్నది. అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేసినట్టుగానే బయటకు కనిపిస్తున్నప్పటికీ.. తన శాఖలో తనను బైపాస్ చేసి వేరెవరో నిర్ణయాలు తీసుకోవడం ఆయన ఆక్రోశానికి కారణమైనట్టు కనిపిస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు.

సమన్వయంతో పనిచేయండి

డ్రగ్స్, అక్రమ మద్యం సరఫరా, కల్తీకల్లు, గుడుంబా, గంజాయి సరఫరా, అమ్మకాలపై నిరంతర నిఘా పెట్టాలని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో, పోలీసు శాఖ సమన్వయంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు పని చేయాలని సూచించారు. తయారీదారులు, సరఫరాదారులు, విక్రేతలు, సప్లయర్ నెట్‌వర్క్ జాబితా తయారు చేసి డాటా బేస్ తయారు చేయాలని దిశానిర్దేశం చేశారు. తరచుగా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

రైతులు ఏమనుకుంటున్నారు?

- రుణమాఫీ, రైతుబంధుకు కొత్త నిబంధనలపై లీకులిచ్చి... ఆపై ఆరా తీస్తున్న ప్రభుత్వం
- ప్రత్యేకంగా ఫ్లాష్ సర్వేలు
- నెగెటివ్ ఫీడ్ బ్యాక్‌తో ప్రభుత్వం కలవరం!

హైదరాబాద్, జూన్ 18(నమస్తే తెలంగాణ): 'పథకాల్లో కోతలు పెట్టాలె.. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలె.. తద్వారా ఆర్థిక భారం తగ్గించుకోవాలి..' ఇది కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తు. ప్రభుత్వ పథకాల్లో విధించబోయే కోతలకు, షరతులకు లబ్ధిదారులను ముఖ్యంగా రైతులను మానసికంగా సిద్ధం చేసేందుకు ప్రభుత్వం వారిపై 'లీకు'ల అస్త్రాన్ని ప్రయోగిస్తున్నది. ఎంపిక చేసుకున్న ప్రసార మాధ్యమాలకు తొలుత కోతలపై లీకులు అందించి, తమ ఆలోచనలకు అనుగుణంగా కథనాలను వండి వార్పిస్తున్నది. ఆ తర్వాత ఈ కోతలు, కథనాలపై ప్రజలు ఏమనుకుంటున్నారో? అంటూ ఆరా తీస్తున్నది. ఇందుకోసం ఏకంగా సీఎంవోలోని కీలకవ్యక్తులే రంగంలోకి దిగడం గమనార్హం. దీనికితోడు ప్రత్యేకంగా సర్వే సంస్థలను కూడా నియమించుకున్నట్టు తెలిసింది. ఈ లీకులు, కోతలపై ప్రజల్లో ఎలాంటి చర్చ జరుగుతుందనే అంశంపై ఫ్లాష్ సర్వేలు చేసి నివేదికలు తెప్పించుకుంటున్నట్టు సమాచారం. ఈ రెండు అంశాలే కాకుండా ఇతర అంశాలపై కూడా లీకులిస్తూ రోజువారీగా ఫ్లాష్ సర్వేలు చేయిస్తూ నివేదికలు తెప్పించుకుంటున్నట్టు తెలిసింది. కోతలపై ముందు లీకులిచ్చి.. ఆ తర్వాత పరిణామాలపై అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

సర్వేల్లో నెగిటివ్ రిపోర్ట్

రుణమాఫీ, రైతుభరోసా (రైతుబంధు) పథకాల్లో కోతలు పెట్టబోతున్నట్టుగా ప్రభుత్వం లీకులిచ్చింది. ఈ పథకాలకు పీఎం కిసాన్ పథకం నిబంధనలు అమలు చేస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని లీకుల ద్వారానే తెరపైకి తీసుకొచ్చింది. ఒకవేళ పీఎం కిసాన్ పథకం నిబంధనలు అమలు చేస్తే రాష్ట్రంలోని సగం మంది రైతులు ఇటు రుణమాఫీ, అటు రైతుబంధుకు అనర్హులుగా మిగిలిపోతారు. ఇంత పెద్ద అంశాన్ని లీకుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావించింది. ఆ తర్వాత ప్రజల నుంచి ఏ రకమైన స్పందన వస్తుందనే అంశంపై ఆరా తీస్తున్నది. 'రుణమాఫీ, రైతుబంధుకు పీఎం కిసాన్ పథకం నిబంధనలు అమలుచేయాలనే వార్తలపై రైతులు ఏ విధంగా స్పందిస్తున్నారు?' అంటూ సీఎంవో నుంచి ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగానే తెలిసినవారికి ఫోన్లు చేసి వివరాలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి నెగెటివ్ రిపోర్టులు అందినట్టు తెలిసింది. ఈ నిబంధనల అమలుపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు సర్వేల్లో తేలిందని సమాచారం. ఈ నేపథ్యంలో రైతుల నుంచి వస్తున్న వ్యతిరేకతపై ప్రభుత్వంలో ఒకింత ఆందోళన వ్యక్తమవుతున్నట్టు సమాచారం. ప్రచార సమయంలోనే ఇంత భారీ వ్యతిరేకత వ్యక్తమైతే, ఒకవేళ ఈ నిబంధనలను అమలు చేస్తే ఆ వ్యతిరేకత మరింత ఎక్కువవుతుందనే ఆందోళనలో ఉన్నట్టు తెలిసింది. రైతుబంధు, రుణమాఫీ పథకాలకు షరతులు పెట్టి, కోతలు విధిస్తే కాంగ్రెస్ పార్టీ పుట్టి మునగడం ఖాయమని, ఇక తమకు ఆ పార్టీలో రాజకీయ భవిష్యత్తు ఉండదని పలువురు నేతలు కూడా ఆందోళన చెందుతుండటం గమనార్హం.

కోతలపై ప్రశ్నిస్తే బెదిరింపులు

మొదటిపేజీ తరువాయి...

మహిళా జర్నలిస్టు రేవతి రీ ట్వీట్ చేస్తూ విద్యుత్తుశాఖ తీరుపై మండిపడ్డారు. ప్రశ్నించే హక్కు మీకు ఎక్కడిది? అనే రీతిలో అధికార యంత్రాంగం ప్రవర్తించడంపై ఫైరయ్యారు. విద్యుత్తు శాఖ విషయంలో పోలీసులు జోక్యం చేసుకోవడంపై ఆమె నిలదీశారు. ఈ పరిణామాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా స్పందించారు. సమస్యలపై ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అని ఎక్స్ వేదికగా నిలదీశారు.

ఏకబిగిన 7 గంటలు కరెంట్ కట్

హైదరాబాద్ ఎల్బీనగర్ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన కృతిక అనే మహిళ తమ దగ్గర కొన్ని రోజులుగా తరచూ గంటలకొద్దీ కరెంటు పోతున్నదని ట్వీట్‌లో పేర్కొన్నారు. శనివారం ఏకంగా ఏడుగంటలపాటు కరెంటు పోయిందని ఆమె పోస్టులో పేర్కొన్నట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్తు శాఖ సిబ్బంది మంగళవారం ఉదయం కృతిక ఇంటికి వెళ్లినట్టు తెలిసింది. కరెంటు కోతలపై ఎందుకు ట్వీట్ చేశారని ఆమెను ప్రశ్నించిన సిబ్బంది.. వెంటనే ట్వీట్ తొలగించాలని బెదిరింపులకు దిగారు. ఇదే విషయాన్ని కృతిక మంగళవారం ఉదయం 11.11 గంటలకు మళ్లీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'కరెంటు కట్ అయిందని కంప్లయింట్ చేస్తే ఇంటికి వచ్చి మరీ ట్వీట్ డిలీట్ చేయిస్తున్నారు పైనుంచి ప్రెషర్ ఉన్నదని. ఎలాంటి ప్రభుత్వం ఇది?' అని అసహనం వ్యక్తం చేశారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మహిళా జర్నలిస్టు రేవతి సాయంత్రం ఘాటుగా స్పందించారు. ఎల్బీనగర్ పరిధిలో ఊహించని పరిణామం జరిగిందని తెలిపారు. కరెంటు కోతలను చెప్పుకుంటే లైన్‌మెన్ బెదిరించి మరీ ట్వీట్‌ను డిలీట్ చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని తాను నిర్ధారణ చేసుకున్నానని, సదరు మహిళతో మాట్లాడితే ఆమె తన భద్రత పట్ల భయం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తాను అద్దె ఇంట్లో ఉంటున్నానని, విద్యుత్తు సిబ్బందికి ఇప్పటికే తన అడ్రసు కూడా తెలిసిపోయిందనే ఆందోళనను బాధితురాలు వ్యక్తంచేసిందని చెప్పారు. సోషల్ మీడియా యుగంలో ఫిర్యాదు చేస్తే ప్రశ్నించే హక్కులేదనే రీతిలో విద్యుత్తు శాఖ తీరు ఉన్నదని మండిపడ్డారు.

పోలీసుల ప్రవేశంతో మరో మలుపు

ఎక్స్ వేదికగా కరెంటుపై జరుగుతున్న ఈ రచ్చలోకి రాచకొండ పోలీసులు ప్రవేశించడం మరో మలుపు తిప్పింది. ఈ అంశంపై పూర్తి వివరాలిస్తే తాము పరిశీలిస్తామంటూ రాచకొండ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. జర్నలిస్టు రేవతి 'ఇది విద్యుత్తు శాఖకు సంబంధించిన అంశం కదా. మీరు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు?' అని ప్రశ్నించారు. ఒక మహిళకు జరిగిన ఇబ్బందిని తాను లేవనెత్తితే పోలీసులు ఎందుకు కలుగచేసుకుంటున్నారని నిలదీశారు.

తెలంగాణలో షాకింగ్ పరిణామాలు: కేటీఆర్

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే కరెంటు రచ్చపై స్పందించారు. 'విద్యుత్తు సరఫరాకు సంబంధించి పౌరులు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తిన జర్నలిస్టుపైనే పోలీసులు బెదిరింపులకు పాల్పడతారా? రాష్ట్రంలో జరుగుతున్న ఈ పరిణామాలు షాక్‌నిచ్చేలా ఉన్నాయి. అసలు మీకు ఏమి హక్కు ఉన్నదని విద్యుత్తు సమస్యలపై ఫిర్యాదు చేసిన వారిని బెదిరిస్తారు' అని ఎక్స్ వేదికగా నిలదీశారు. పోలీస్‌శాఖ ఏమైనా విద్యుత్తు శాఖను సైతం నడుపుతుందా? సోషల్ మీడియాలో ఎవరైనా ప్రశ్నలు లేవనెత్తితే వారిపై మీరు కేసులు పెడతారా? అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనికి తెలంగాణ డీజీపీ, రాచకొండ పోలీసులు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

విద్యుత్తు సరఫరాను వెంటనే పునరుద్ధరించాం: ఎస్ఈ

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎల్బీనగర్ సెక్షన్ పరిధిలోని ఎల్‌పీటీ మార్కెట్ ప్రాంతంలో ఉదయం సబ్‌స్టేషన్‌లో విద్యుత్తు అంతరాయం తలెత్తిందని సరూర్‌నగర్ సర్కిల్ సూపరింటెండెంట్ కరుణాకర్ తెలిపారు. ట్రాన్స్‌కో విభాగం అధికారులు పనులు చేస్తుండటం ఒక ఫీడర్ నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేసి, మరో ఫీడర్ నుంచి సరఫరా ఇచ్చామని పేర్కొన్నారు. ఇందుకు 5 నిమిషాల సమయం పట్టిందని చెప్పారు. ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేసిన వినియోగదారులు గత శనివారం తలెత్తిన విద్యుత్తు అంతరాయం మూడు గంటలకుపైగా ఉన్నదని తెలిపారు. అయితే దానికి ముందుగానే ప్రకటన ఇచ్చామని పేర్కొన్నారు.

కరెంటు లేక.. ట్యాంకర్ ద్వారా తడులు

కరీంనగర్ రూరల్, జూన్ 18: ఓ వైపు వర్షాలు లేక నిరాశ చెందుతుండగా.. మరోవైపు బావులపై మీద ఆధారపడి సాగు చేస్తున్నవారికి విద్యుత్తు అధికారుల తీరుతో నారుమడులు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ శివారులోని పొలాలకు చేగుర్తి ఫీడర్ ద్వారా విద్యుత్తు సరఫరా జరుగుతున్నది. రెండ్రోజుల క్రితం గాలివానకు విద్యుత్తు స్తంభం ఒరిగి కేబుల్ వైర్ మీద పడటంతో సరఫరా నిలిచిపోయింది. ఎండలు దంచి కొడుతుండటంతో నారుమడులు ఎండిపోయే స్థితికి చేరాయి. బావుల్లో నీరున్నా కరెంట్ లేక అందించుకోలేని దుస్థితి నెలకొన్నది. దీంతో మంగళవారం కౌలు రైతు మంద అశోక్ రూ.2 వేలు వెచ్చించి వాటర్ ట్యాంకర్ తెప్పించి నీరందించాడు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని రైతు వాపోయాడు.

అంధకారంలో మంచిర్యాల

- సాయంత్రం 6 గంటలకు పోయిన కరెంట్
- రాత్రి 10 గంటలైనా రాకపోవడంతో అవస్థలు



మంచిర్యాల, జూన్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరెంట్ లేక మంచిర్యాల పట్టణం అంధకారమైంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంట, శ్రీశ్రీనగర్, రాజరాజేశ్వర కాలనీ, కాకతీయ కాలనీ, తోళ్లవాగు ఏరియా, చున్నంబట్టి వాడ (మంచిర్యాల టౌన్-3)లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు కరెంట్ పోయింది. దీనిపై ఆయా ప్రాంతాల వాసులు ట్రాన్స్‌కో ఏఈ నర్సయ్యకు ఫోన్ చేయగా.. సమస్య ఏంటో తెలియడం లేదని సమాధానం చెప్పినట్టు సమాచారం. నెల రోజులుగా రోజూ తమ ప్రాంతాల్లో కరెంట్ పోతుందంటూ కాలనీల వాసులు వాపోతున్నారు. ఓ రోజు ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ అని, తెల్లారి ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అయిందని, చెట్లు నరకుతున్నామని, వైర్లు జాయింట్ అయ్యాయని ఇలా ఏదో ఒక సమస్య చెప్తున్నారని తెలిపారు. మంగళవారం కరెంట్ పోయిన విషయంపై అధికారులను అడిగితే రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే మెయిన్ లైన్‌లో ఏదో ప్రాబ్లమ్ ఉందని చెప్పారు. ఎక్కడ సమస్య వచ్చిందో వెతుకుతున్నామని, కాసేపు అయ్యాక వస్తుందని రాత్రి 10 గంటలకు లైన్‌మెన్లు చెప్పినట్టు ఆయా కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ విషయంపై 'నమస్తే తెలంగాణ' విద్యుత్తు శాఖ ఏడీ వేణుగోపాల్‌కు రెండు సార్లు ఫోన్ చేయగా ఆయన స్పందించ లేదు. అధికారులు కనీసం సమాధానం చెప్పే పరిస్థితుల్లో లేకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. గడిచిన పదేండ్లలో ఏ నాడూ రెప్పపాటు కూడా కరెంట్ పోలేదని, కొద్ది రోజులుగా ప్రతి రోజూ కరెంట్‌తో ఇదే సమస్య వస్తున్నదని కాలనీల వాసులు వాపోతున్నారు.

విద్యా హక్కును ఎందుకు అమలు చేయలేదు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యా హక్కును కల్పిస్తూ 2009లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. రాష్ట్రంలో ఈ చట్టం ఏ స్థాయిలో అమలవుతున్నదో చెప్పాలని, పూర్తిస్థాయిలో ఎందుకు అమలు చేయలేదో వివరించాలని ఆదేశించింది. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 25% సీట్లను ఉచితంగా కేటాయించాలన్న నిబంధన అమలు చేయడం లేదన్న పిల్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం మంగళవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ హాస్టళ్లలో బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు, పరుపులు, దిండ్లు, అగ్నిమాపక సామగ్రి లేవన్న మరో వ్యాజ్యంలో వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అనంతరం ఈ రెండు పిటిషన్లపై విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

టీచర్ల ప్రమోషన్లు కోర్టు ధిక్కారమే

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన అంశం విచారణలో ఉండగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్ల ప్రక్రియను కొనసాగించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)తో సంబంధం లేకుండా పదోన్నతులను కల్పించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను డివిజన్ బెంచ్ రద్దుచేసి, ఈ వివాదాన్ని మళ్లీ సింగిల్ జడ్జికి పంపామన్న విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతుల ప్రక్రియను కొనసాగించడం కోర్టు ధిక్కార చర్యే అవుతుందని వ్యాఖ్యానించింది. ఇప్పటివరకు చేపట్టిన పదోన్నతులను వెంటనే ఉపసంహరించుకునేలా ప్రభుత్వానికి సూచనలు చేయాలని జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం ప్రభుత్వ న్యాయవాదికి స్పష్టం చేసింది. గత ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం స్వయంగా ఈ విచారణకు హాజరయ్యారు. ఎన్సీటీఈ నిబంధనల ప్రకారమే పదోన్నతుల ప్రక్రియ మొదలు పెట్టామని, టెట్‌లో అర్హత సాధించినవారిని పరిగణనలోకి తీసుకున్నామని ఆమె చెప్పారు. దీనిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి ఈ నెల 14న ఇచ్చిన ఉత్తర్వులే అమల్లో ఉంటాయని, తాజాగా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని ప్రభుత్వ న్యాయవాదికి తేల్చిచెప్తూ.. అప్పీళ్లపై విచారణను మూసివేసింది.

'దళితబంధు' రెండో విడత నిధులేవి?

హుజూరాబాద్, జూన్ 18: దళితబంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులు డిమాండ్ చేశారు. దాదాపు వంద మంది లబ్ధిదారులు మంగళవారం కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట నుంచి హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కార్ దళితబంధు పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించగా, కాంగ్రెస్ సర్కారు అసలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.